క్లుప్తంగా

నేడు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

పెదకూరపాడు: పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గురువారం పెదకూరపాడులోని రూ.8.30 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించనున్నారు. అనంతరం పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తారని మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్ తెలిపారు. అమరావతి మండలం వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కర్లపూడి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ, నెమలికల్లు గ్రామంలో షాదీఖానా, బీసీ కళ్యాణ మండపం ప్రారంభించనున్నారు. ఉంగుటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, లేమల్లె గ్రామంలో ముస్లిం షాదీఖానా ప్రారంభించనున్నారు. నరుకుళ్లపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం, అత్తలూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించనున్నారు.

ప్రముఖ వ్యాపారి రమేష్ గుండెపోటుతో మృతి

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు నిడమానూరి రమేష్ (56) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య హిమబిందు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం నిడమానూరి రమేష్ స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయనతో పాటు నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, శెట్టి ఆనంద్, ఆర్య వైశ్య నాయకులు, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు



పెదకూరపాడు(అచ్చంపేట): వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమంతో అచ్చంపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన జనసేన నాయకులు బుధవారం యువజన నాయకుడు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కళ్యాణ్‌చక్రవర్తి, ఆయన సతీమణి వసంతకుమారి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వసంతకుమారి, కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ పెదకూరపాడు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులను గెలిపించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో కోమరాల రమేష్ వారి అనుచరులున్నారు.

నేడు మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

అమరావతి: మండల ప్రజలు ఎన్నడు చూడని విధంగా, మండల పరిధిలోని నెమలికల్లు, లేమల్లె, అమరావతి, అత్తలూరు గ్రామాలలో రూ.4.56 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభిస్తున్నారు. ఈ గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, రైతు భరోసా కేంద్రం, ముస్లిం షాదీఖానాలు, గురుకుల పాఠశాల అదనపు తరగతి గదుల భవనాలను అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. బుధవారం పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌బాబు మాట్లాడుతూ అమరావతి అంబేడ్కర్ గురుకుల పాఠశాల అదనపు తరగతి గదులు, అత్తలూరులో రైతు భరోసా కేంద్రం, లేమల్లె, నెమలికల్లులో షాదీఖానాలను ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం మండల పరిధిలోని పలుగ్రామాలలో పర్యటించి పలు ప్రారంభోత్సవాలలో పాల్గొంటారని బుధవారం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు తెలిపారు. అత్తలూరు గ్రామంలో బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నకరికల్లు: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను ప్రస్తుత యాప్‌లోనే స్క్రీనింగ్ సర్వే ద్వారా నమోదు చేయాలని ఐఈడీ స్టేట్ కోఆర్డినేటర్ జి.మల్లిఖార్జునరావు తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు అవలంబిస్తున్న బోధనా పద్ధతులు, హాజరు శాతం, భోజన సామగ్రి, కల్పిస్తున్న వసతులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఆటపాటలతో బోధన, పరికరాల ద్వారా మాట్లాడడం, వినడం అలవాటు చేస్తారని అన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తారని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ఐఈడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపులను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన వ్యక్తి పవన్

- విశ్వాసపాత్రులకు..విశ్వాస ఘాతకులకు మధ్య జరుగుతున్న యుద్ధం
- అంబటి, అనిల్ అన్నలకు వెల్లువెత్తిన అభిమానం



ఉప్పలపాడు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్



ఉప్పలపాడు సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: నరసరావుపేట పార్లమెంట్‌ను నడిపించే శ్రీకృష్ణుడు అనిల్‌కుమార్ యాదవ్ అని, ఆయన రథచక్రాల కింద కురుక్షేత్ర నేతలంతా పడి నలిగిపోవడం ఖాయమని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామంలో జరిగిన రూ.5 కోట్ల (గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విద్యుత్ సబ్ స్టేషన్)ల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో నెల్లూరు శాసన సభ్యులు, మాజీ మంత్రి, నరసరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌తో కలసి మంత్రి అంబటి రాంబాబు మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మంత్రి అంబటి మాట్లాడుతూ సత్తెనపల్లిలో నాపైన, నరసరావుపేటలో అనిల్‌కుమార్‌యాదవ్ పైన పోటీ చేస్తున్న వారు ఎవ్వరో మీకు తెలుసునా... ఒకాయన కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగి పదవులు అనుభవించి, బీజేపీలో చేరి, చివరికి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. ఇంకొకాయన బీసీలకు నరసరావుపేట సీటు కేటాయిద్దామంటే పార్టీ మారుతూ పోటీకొస్తున్నారన్నారు. మేము జగనన్న సైనికులమని, విశ్వాసపాత్రులమన్నారు. మాపై పోటీ చేస్తున్న వారు పార్టీలు మారిన విశ్వాసఘాతకులన్నారు. విశ్వాసపాత్రులకు అండగా ఉండి ఆశీర్వదించాలని అంబటి కోరారు. ఉప్పలపాడులో ఇంత అపూర్వ ఆదరణ అందించిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు నుంచి జగనన్న పంపిస్తే వచ్చాను. మీ బిడ్డగా, మీ తమ్ముడిగా, మీ అన్నగా ఉంటాను, నన్ను ఆశీర్వదించాలన్నారు. బడుగులకు దక్కిన అవకాశం, జగనన్న ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగన్‌కు సత్తా ఉండబట్టే ప్రతిపక్షాలన్నీ కట్టకట్టుకుని వస్తున్నాయన్నారు. ఒకరు ఇద్దరు ఊరిలో బాగుపడాలంటే బాబుకు ఓటేయాలని, ఊరంతా బాగు పడాలంటే జగనన్నను మళ్లీ గెలిపించాలన్నారు. ప్రతీ నెల 70 లక్షల మందికి నేరుగా, పారదర్శకంగా పింఛన్లు అందిస్తున్న ఘనత జగనన్నకే సాధ్యమయ్యిందన్నారు. పవన్‌కళ్యాణ్ కాపులను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన ద్రోహి అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో గెలిచి జగనన్నకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. ముందుగా రెడ్డిగూడెం నుంచి ఉప్పలపాడు వరకు 9 కిలోమీటర్ల మేర వెయ్యి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తుండగా రెడ్డిగూడెం, గణపవరం సెంటర్లలో కార్యకర్తలు, అభిమానులు నీరాజనాలు పట్టి భారీ గజమాలలతో సత్కరించారు. ముందుగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభించి, రూ.4.5 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజచేశారు. సభానంతరం టీడీపీ పార్టీకి చెందిన కొత్తూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, ఆయనతోపాటు ఆరు కుటుంబాలకు చెందిన యాదవనాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి అనిల్‌కుమార్‌యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, వైఎస్సార్ సీనియర్ నాయకులు లాయర్ పక్కాల సూరిబాబు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, ఎంపీటీసీ భద్రారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు పి.శ్రీనివాసరెడ్డి, జేఏసీ కన్వీనర్ పులిబండ్ల అశోక్ పాల్గొన్నారు.

పారుపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించండి



ప్రధాన రహదారి నుంచి పారుపల్లి గ్రామానికి వెళ్తున్న గ్రావెల్ రోడ్డు

క్రోసూరు: క్రోసూరు మండలంలోని పీసపాడు గ్రామ అనుబంధ గ్రామమైన పారుపల్లి గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘమైన ఎమ్మెస్పీ అధ్యక్షుడు జడా సుబ్బు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు పత్రికా సమావేశం ద్వారా బుధవారం విన్నవించుకున్నారు. గ్రామంలో 150 కుటుంబాల మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు జీవిస్తున్నారని, గ్రామానికి రోడ్డు మార్గం లేదని, బస్సు సౌకర్యం లేదని వాపోయారు. పీసపాడు నుంచి మూడు కిలో మీటర్ల దూరం గల పారుపల్లి గ్రామానికి ద్విచక్రవాహనాలు, కాలి నడక మాత్రమే శరణ్యమని అన్నారు. రాత్రి సమయాల్లో ఏదైనా అనారోగ్యం చేస్తే వైద్యానికి నోచుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వెంటనే గ్రామాన్ని సందర్శించి అక్కడి ప్రజల కొరకు రోడ్డు, బస్ షెల్టర్ నిర్మాంచాలని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు రేపూడి ప్రభుదాసు ఉన్నారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే

- అపరిష్కృతంగా ఉన్న డంపింగ్‌యార్డ్‌కు పరిష్కారం
- శాసనసభ్యుడిగా పోటీ చేసేది నేనే .. గెలుపు నాదే
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన చైర్‌పర్సన్ లక్ష్మీతులసీ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనేనని తాను విశ్వసిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆయన ఎక్స్‌అఫీషియో హోదాలో హాజరై మాట్లాడారు. బహుశా వచ్చే నెలలో సమావేశం జరగక పోవచ్చునని, ఒక వేళ జరిగినా కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదని ఆయన అన్నారు. వచ్చే నెల 2వ వారం లేదా 3వ వారం సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చాక నిబంధనలకు అనుగుణంగా నడుచు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కీలక ఆర్థిక పరమైన విషయాలు ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత సాధ్యం కాదన్నారు. శాసనసభకు నా టర్మ్‌కు అయి పోవస్తుందని, మీ టర్మ్ ఇంకా రెండు సంవత్సరాలు అంటే 2026 మార్చికి తిరిగి మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించిందని, మళ్లీ ఎన్నికల తరువాత జరిగేటటువంటి సమావేశానికి కూడా తానే ఈ సీటులో కూర్చుంటానని నాకున్న విశ్వాసం అన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని తాను నమ్ముతున్నానన్నారు. మున్సిపాలిటీలో చాలా పనులు చేశామని, చేయాల్సిన పనులు కూడా ఉన్నాయన్నారు. ఎవ్వరూ చేయలేని పనిని వైఎస్సార్ సీపీ అధికారంలో, తన హయాంలో సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేటరోడ్డులో ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్నటువంటి డంపింగ్ యార్డును క్లియర్ చేసి మంచి వాతావరణాన్ని క్రియేట్ చేయడానికి ప్రయత్నం చేశానని సగర్వంగా ఈ సమావేశం ద్వారా చెబుతున్నానన్నారు. అలాగే ఏరియా వైద్యశాల, వెల్ నెస్ సెంటర్లు, తహసీల్దారు కార్యాలయం సగంలో నిర్మాణం చేసి వదిలేస్తే దానిని కంప్లీట్ చేశామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. నిరంతరం సమస్యలు ఉంటాయని, ఆ సమస్యలన్నింటినీ కూడా పరిష్కరించే అవకాశాన్ని మళ్లీ వైఎస్సార్‌సీపీకే ఇస్తారని.. మరలా కౌన్సిల్‌లో మనం మాట్లాడుకునే అవకాశం ఉంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ముందుగా సమావేశంలో 21వ వార్డు కౌన్సిలర్ తురకా మేరీగ్రేస్, 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి, 12వ వార్డు కౌన్సిలర్ లోకా కళ్యాణిలు పలు సమస్యలను ప్రస్తావించగా వాటికి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సమాధానం ఇచ్చారు. అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులున్నారు.

పండ్లతోటల పెంపకానికి నూరుశాతం రాయితీ



ఎఫ్ఏలకు సూచనలిస్తున్న హార్టికల్చర్ సూపర్‌వైజర్ అమరజ్యోతి, పక్కన ఏపీవో,ఈసీ

నకరికల్లు: పండ్లతోటలను పెంచే రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా మూడేళ్లపాటు నూరుశాతం రాయితీ కల్పిస్తున్నట్లు హార్టికల్చర్ సూపర్‌వైజర్ ఏ.అమరజ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హార్టికల్చర్‌లో భాగంగా ఐదెకరాల లోపు పరిమితితో మామిడి, సపోట తదితర పండ్ల తోటల పెంపకానికి మూడేళ్లపాటు నూరుశాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఫ్లోరీకల్చర్‌లో భాగంగా 25 సెంట్ల భూమిలో మల్లెతోట పెంపకానికి రెండేళ్లకు గాను రూ.50 వేలు, 25 సెంట్ల భూమిలో గులాబితోట పెంపకానికి రెండేళ్లకు గాను రూ.36 వేలు రాయితీ వస్తుందన్నారు. హార్టికల్చర్ విధానంలో రెండు సంవత్సరాల వరకు అంతరపంటల సాగుకు అవకాశం ఉందన్నారు. అంతరపంటల సాగుకు భూమి దున్నుకునేందుకు రూ.1,600 రైతుకు ఇస్తామని అన్నారు. 25 సెంట్ల విస్తీర్ణంలో మునగతోట సాగుకు రెండేళ్లకు గాను రూ.22 వేలు రాయితీ అందుతుందన్నారు. ఆసక్తిగల రైతులు ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో డి.సుందరరావు, ఈసీ ఎం.కృష్ణకుమారి, టి.ఎ.ఎం.గోపికృష్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తీసుకో గరమ్ గరమ్ చాయ్..

చాయ్..చాయ్..ఇదిగో గరమ్ గరమ్ చాయ్ తీసుకో.. తాగండయ్యా.. ఎలా ఉంది టేస్ట్.. అని అడగ్గానే సూపర్ సార్..అంటూ ప్రజల నుంచి స్పందన వచ్చింది.. ఆ చాయ్ వాలా ఎవరో కాదు.. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు.



సత్తెనపల్లిలో టీ కాస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో బుధవారం ఉదయం మంత్రి అంబటి ఓ టీ స్టాల్‌కి వెళ్లారు. నియోజకవర్గ ప్రజలపై ఉన్న ఆప్యాయతలను డికాక్షన్‌గా మార్చి.. వారితో ఉన్న అనుబంధాన్ని పాలుగా చేసి .. మనసుతో మరిగించి .. చిక్కటి చిరునవ్వుతో అక్కడ ఉన్న ప్రజలకు అందించారు. అందుకే టీ ఒక్క సిప్ చేసిన వెంటనే సూపర్ మినిస్టర్ సాబ్ అంటూ అందరూ ఆనందంగా చెప్పారు. అనంతరం మంత్రి అంబటి మరో హోటల్‌కి వెళ్లి.. అక్కడ పూరీలను, దోశలను తానే స్వయంగా తయారు చేసి స్థానికులకు వడ్డించారు. ఒక రాజకీయ నాయకుడంటే కేవలం నిత్యం రాజకీయాలు.. విమర్శలు..మందీ మార్బలం.. అధికార దర్పమే కాదని, ప్రతి అంశంలోనూ పరిపూర్ణంగా ఉండే నేత అంబటి రాంబాబు అని అక్కడ వారంతా కొనియాడారు. మంత్రి అంబటి రాంబాబు చాయ్ వాలాగా, చెఫ్‌గా మారి వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపారు.

ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ అమలకుమారి

ముప్పాళ్ళ: ప్రకృతి వ్యవసాయం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ కే అమలకుమారి చెప్పారు. స్థానిక వెన్నెల మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగం, సెర్ప్ విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలకు బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలన్నీ మండల సమాఖ్య అనుసంధానంతో చేయడం జరుగుతుందన్నారు. మండల సమాఖ్య సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. మహిళా రైతులందరూ ఈ వ్యవసాయ విధానాలను పాటించాలని తెలిపారు. రసాయన మందులు విచక్షణా రహితంగా వాడటం వలన భూమి ఏ విధంగా నష్టపోతుంది, మన ఆరోగ్యం ఏ విధంగా దెబ్బ తింటుంది అనే అంశాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాలస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాములమ్మ, ఎస్ఎఫ్ఏ నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ పూజ, గ్రామ సంఘాల ఓబీలు, వెలుగు యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదిపాడులో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పెదకూరపాడు(అచ్చంపేట): అచ్చంపేట మండలంలో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో ఎంతో మంది టీడీపీకి చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మండలంలోని మాదిపాడు గ్రామంలో టీడీపీకి చెందిన మూడు కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందిస్తున్నారన్నారు. కులం, మతం, పార్టీ భేదాలు లేకుండా అందరికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పెదకూరపాడు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్ పీరా, షేక్ ఇసుబు తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు



టైలర్స్‌డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అమరావతి పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని టైలర్స్ పాల్గొని అమరావతి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్.హుమాయున్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హుమాయున్ మాట్లాడుతూ టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ పని చేస్తుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో రెడీమేడ్ రంగం వైపు ప్రజలు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో టైలర్ల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారి కుటుంబ పోషణ భారమవడంతో దుర్భర స్థితిని అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా కొంత లబ్ధి చేకూరినప్పటికీ రుణసదుపాయం కల్పించి ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, షబ్బీర్, బాజీ, సైదా, నజీర్, నాగులు, పూర్ణచంద్రరావు, సింహారావు, రమేష్ పాల్గొన్నారు.

పెదకూరపాడులో ఘనంగా టైలర్స్ డే

పెదకూరపాడు: నియోజకవర్గంలోని పెదకూరపాడు, అచ్చంపేట మండలాల్లో టైలర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ సృషికర్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచ్చంపేటలో సీనియర్ టైలర్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, నందిగామ రమేష్, పఠాన్ అయూబ్, కలవ నాగేశ్వరరావు, సుభాని, నాగుల్‌మిరా, హుస్సేన్, బాలస్వామి, కిరణ్, మౌలాలి, హరికృష్ణ, గురునాధం పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం అయిన ప్రభుత్వ భవనాలు

సత్తెనపల్లి: సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. పట్టణాలతో సమానంగా పల్లెల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. గ్రామంలో రూ.83.60 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.40 లక్షలతో నూతన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. అలాగే సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామం నుంచి ఫిరంగిపురం మండలం యర్రగుంటపాడు వరకు రూ.2.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, బీసీ రజక కాలనీలో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మార్చి 1వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి, నెల్లూరు శాసనసభ్యుడు, నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర రెడ్డి కోరారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



త్యాళ్ళూరులో సైన్స్ ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

పెదకూరపాడు: మండలంలోని పెదకూరపాడు, 75త్యాళ్ళూరు గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఆటల్ ల్యాబ్‌లో జరిగిన సైన్స్ వర్క్‌షాప్‌లో ఎల్ఈడీ విద్యుత్ బల్బులను తయారుచేశారు. విద్యార్థులు చేసిన రాకెట్ లాంచింగ్ తల్లిదండ్రులను, విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకర్షించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, పీసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో సైన్స్ దినోత్సవం

నకరికల్లు: విజ్ఞాన శాస్త్ర ఫలాలు మానవ వికాసానికి తోడ్పడాలని ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహిం అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రోసూరులో సైన్సు దినోత్సవం

క్రోసూరు: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని క్రోసూరు సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎక్స్‌పో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ మేరీ రజిత భారత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ నోబెల్ పురస్కారం అందుకున్న సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. సీవీరామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సైన్స్ లేకుండా ఏదీ వాస్తవంగా గుర్తించబడదన్నారు. సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు చేసిన 120 ప్రాజెక్టులను పరిశీలించారు. అలాగే జాతీయ సైన్స్ దినోత్సవం క్రోసూరులోని స్ప్రింగ్స్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్లు గోవర్ధన్‌రావు, పద్మావతి పర్యవేక్షించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలు, ప్రయోగాలు చేసి చక్కగా వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్‌లైన్ రోడ్డు పనులు పరిశీలన


అమరావతి: అమరావతి-బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు ఆదేశించారు. బుధవారం అమరావతి-దిడుగు గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. దిడుగు-అమరావతి మధ్యలో ఉన్న కల్వర్టుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టును వెడల్పు చేసి సిమెంట్ రోడ్డు వేయాలన్నారు. పనుల్లో జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.

భ్రూణ హత్యల నివారణపై అవగాహన



పెదకూరపాడు: అచ్చంపేటలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 75త్యాళ్ళూరు ప్రాజెక్టు అధికారి స్వర్ణ మాట్లాడుతూ ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం దిశ చట్టంతో బాలికల సంరక్షణకు పెద్దపీట వేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాణిక్యం, బాలత్రిపుర సుందరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 3న జరుగు పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



రాజుపాలెం: మండలంలో మార్చి 3వ తేదీన జరుగు పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటకృష్ణ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన పోలియో కేంద్రాలలో ఐదేళ్లలోపు పిల్లందరికి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మిగిన వారికి 4, 5 తేదీలలో ఇంటింటా తిరిగి పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. మండలంలో 3,865 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని వారి కోసం 23 పల్స్ పోలియో బూత్‌లు, ఒక మొబైల్ వాహనం, రెండు రూట్లకు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, రమాదేవి పాల్గొన్నారు.